

జిప్‌లైన్ వివాదంపై గ్రామసభ

- ప్రైవేటు వ్యక్తి నిర్వహణపై ఫిర్యాదు రావడంతో గిరిజనులు, ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాల సేకరణ
- స్థానిక సొసైటీకి అవకాశం ఇవ్వాలని గిరిజనుల డిమాండ్
- కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెల్లడి

- వార్త 8వ పేజీలో..

గంజాయితో భావితరాలకు ముప్పు

జిల్లాలో సమూలంగా అరికట్టాలి

ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలి

- విశాఖ రేంజ్ డీఐజీ డీఐజీ గోపీనాథ్‌జెట్టి
- గంజాయి సాగు రహిత జిల్లా అందరి లక్ష్యం
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పిలుపు





మాట్లాడుతున్న విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, పక్కన కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్, తదితరులు, సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పాడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గంజాయి పంట వల్ల భావితరాలకు పెను ముప్పు వాటిల్లుతుందని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో పోలీస్, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డ్వామా అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయిని సమూలంగా అరికట్టాలని, భావితరాలకు గంజాయి వల్ల నష్టం లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి నిర్మూలనలో భాగమైన ప్రభుత్వ శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గంజాయిలో భాగ స్వామ్యమైన వారి వివరాలు సేకరిస్తున్నామని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందని, గంజాయిని సాగు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గంజాయి సాగుపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయ, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాలల్లో అవగాహన సదస్సులు, డీఅడిక్షన్ సెంటర్‌కు ఎంత మంది వచ్చారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి సాగును విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. జాబ్‌మేళాలు నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ సమావేశం రోజున గంజాయి వినియోగం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై చర్చించాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు. యువతకు స్వయం ఉపాధి పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన యువతకు రుణ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఏజెన్సీలో జి.మాడుగుల, చింతపల్లి, ముంచంగిపుట్టు, జీకేవీధి, కొయ్యూరు మండలాలపై దృష్టి పెట్టాలన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గిరిజన రైతులకు ఉద్యాన వన పంటలను అందిస్తామన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, ఆదిమ జాతి గిరిజనులకు ప్రత్యేకంగా పథకాలు అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఏఎస్పీ కె.ధీరజ్, డీఆర్‌వో బి.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యాన వనాధికారి రమేశ్‌కుమార్‌రావు, గిరిజన సంక్షేమశాఖ విద్యాశాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్ బాషా, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

- రూ.2 లక్షలు జరిమానా

- 7లో

భారీ వర్షాలకు దెబ్బతిన్న సీలేరు- జీకేవీధి రహదారి, వంతెనలు

ఎప్పటికి దారి కొచ్చేనో?

- పది రోజులుగా నిలిచిపోయిన రాకపోకలు
- సీలేరు నుంచి విశాఖకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి
- పనులు వేగంగా జరగడం లేదని సీలేరు, ధారకొండ, దొంకరాయి, మోతుగూడెం వాసుల ఆరోపణ
- కలెక్టర్, ఐటీడీఏ పీవో చర్యలు తీసుకోవాలని వేడుకోలు



సీలేరు సమీపంలో భారీ వర్షాలకు రహదారిపై పడిన కొండచరియలు, బురదను తొలగిస్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 17: **బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో సీలేరు- జీకేవీధి మార్గంలో వంతెనలు, రోడ్లు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల వల్ల ఈ మార్గంలో కొండచరియలు, భారీ చెట్లు విరిగిపడడంతో ఈ నెల 9వ తేదీ నుంచి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆర్ అండ్ బీ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడంతో ఈ నెల 13వ తేదీ రాత్రికి కొంత వరకు రహదారిని పునరుద్ధరించగలిగారు. అయితే భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.**

భారీ వర్షాల వల్ల సీలేరు- జీకే వీధి రహదారి దెబ్బతినడంతో ఈ మార్గాన్ని ఎప్పుడు పునరుద్ధరించి ఎప్పటికి బస్సులను నడుపుతారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో కొండచరియలు, భారీ చెట్లు విరిగిపడడంతో ఆర్ అండ్ బీ అధికారులు వాటిని చాలా వరకు తొలగించారు. అయితే ఈ రహదారిలో లంకపాకలు, నూతిబంద మధ్యలో గల రెండు వంతెనలు భారీ వర్షాల వల్ల బలహీనపడ్డాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, ఈ రహదారిలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని పాడేరు ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందర బాబు తెలిపారు. అయితే సీలేరు- జీకేవీధి అంతర్రాష్ట్ర రహదారిలో రాకపోకలు నిలిచిపోయి పది రోజులు కావస్తున్నా బలహీనపడిన వంతెనలను పటిష్ఠపరిచే పనులు వేగంగా చేయడంలో ఆర్ అండ్ బీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని సీలేరు, ధారకొండ, దొంకరాయి, మోతుగూడెం ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు.

విశాఖ వెళ్లాలంటే ఎన్నో తిప్పలు

గత పది రోజులుగా సీలేరు- గూడెంకొత్తవీధి మీదుగా నర్సీపట్నం, విశాఖపట్నం వెళ్లే మార్గం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో సీలేరు, రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం లేదా, ఒడిశాలోని చిత్రకొండ వెళ్లి అక్కడ నుంచి మల్కన్‌గిరి, జైపూర్ సుంకీ ఘాట్ మీదుగా విజయనగరం, విశాఖపట్నం చేరుకుంటున్నారు. అలా వెళ్లడానికి ఒక్కొక్కరికి సుమారు రూ.800 నుంచి రూ.1,000ల వరకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు ... మిగతా 8వ పేజీలో

మెడికల్ కాలేజీలో ప్రవేశాలు ప్రారంభం

- తొలి ప్రవేశం పొందిన డి.లక్ష్మీలావణ్య
- తొలి రోజు ఆరుగురికి అడ్మిషన్లు



తొలి ఎంబీబీఎస్ సీటు (అడ్మిషన్ పత్రాన్ని) పొందుతున్న డి.లక్ష్మీలావణ్య

పాడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రవేశాలను మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరారు. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన డి.లక్ష్మీలావణ్య తొలి ప్రవేశాన్ని పొందారు. అలాగే జి.భాగ్యభారతి, ఆర్యన్‌మిశ్రా, నిత్యరామలక్ష్మి, మణిదీప్, దీవెనలు ప్రవేశం పొందారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి వారికి ప్రవేశ పత్రాలను అందించారు. గిరిజన ప్రాంతంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలో తొలి బ్యాచ్‌గా తాము ప్రవేశం పొందడం ఆనందంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆరుగురు విద్యార్థులు చేరాలని, గడువు నాటికి తొలి విడత 20 సీట్లు భర్తీ కానున్నాయని ప్రిన్సిపాల్ హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వంట నూనెలు సలసల

కిలోకు రూ.15 నుంచి రూ.20 పెంపు

- మార్కెట్‌లో ఫ్రీడమ్ ఆయిల్ రూ.130
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు



విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): **వంట నూనెల ధరలు పెరిగాయి. సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ బ్రాండ్‌ను బట్టి సగటున కిలో రూ.110 నుంచి రూ.120 మధ్య విక్రయించే వారు. నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకం పెంచనున్నట్టు వెల్లడించింది. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ డీలర్లు, వ్యాపారులు మాత్రం దానిని సాకుగా తీసుకొని రేట్లు పెంచేశారు. లీటరుకు రూ.15 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు.**

విశాఖలో రిటైల్ వ్యాపారులు రెండు రోజులకు ఓసారి డీలర్ నుంచి స్టాకు తెప్పించుకుంటారు. రేట్లు పెరిగాయని, వాటి ప్రకారమైతే పంపిస్తామని డీలర్లు చెప్పడంతో రిటైలర్లు కొత్త రేట్ల ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా రేట్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతూ స్టాకిస్టులు వ్యాపారులు అడిగినంత సరకు ఇవ్వకుండా కొద్దికొద్దిగానే ఇస్తున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని రోజూ ప్రసాదాలు తయారీ, అన్నదానాలు పెద్దఎత్తున నిర్వహిస్తుండడంతో వంట నూనెల విక్రయాలు భారీగా సాగుతున్నాయి. దాంతో డీలర్ల పంట పండింది. కిలోకు అడ్డంగా రూ.15 నుంచి రూ.20 అదనంగా దోచుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. ప్రస్తుతం నగరంలోని రిటైలర్లు ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను లీటరు రూ.130 చొప్పున అమ్ముతున్నారు. విశాక సీతమ్మధార రైతుబజార్ సమీపాన ఉన్న సూపర్ మార్కెట్లలో లీటరు రూ.122 నుంచి రూ.124 వరకు అమ్ముతున్నారు.

ఎంఆర్‌పీ పేరుతో దోపిడీ

డీలర్లు, స్టాకిస్టులు గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) పేరుతో ప్రభుత్వాన్ని, కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. తనిఖీల సమయంలో దొరక్కుండా ఉండేందుకు ముందుగానే అధిక ధరలు ముద్రిస్తున్నారు. సాధారణ సమయాల్లో వాటిని రాయితీపై ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా అనధికారికంగా రేట్లు పెంచినప్పుడు ఎంఆర్‌పీకే ఇస్తున్నామని బుకాయిస్తున్నారు. ఇప్పుడు విశాఖలో అమ్ముతున్న ఫ్రీడమ్ రిఫైన్డ్ ఆయిల్ ప్యాకెట్లపై ఎంఆర్‌పీ రూ.144 ముద్రించి ఉంది. అంటే తాము ఆ రేటుకే ఇస్తున్నామని, ఎక్కువ ధరకు అమ్మడం లేదని చెబుతున్నారు. కేసులు లేకుండా తప్పించుకోవడానికి ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు.

మొద్దునిద్రలో విజిలెన్స్

రాష్ట్రంలో వంట నూనెల ధరలు భారీగా పెంచేశారని గత మూడు రోజులుగా విస్తృత ప్రచారం జరగడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తా అన్ని జిల్లాల్లో స్టాకిస్టులు, డీలర్లు, రిటైలర్లపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చాలా జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. విశాఖలో మాత్రం మంగళవారం రాత్రి 8 గంటల వరకు విజిలెన్స్ అధికారుల నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదు. కొన్ని పెద్ద వ్యాపార సంస్థలకు ముందుగా సమాచారం వెళ్లిందో ఏమో చిత్రాలయ ఎదురుగా ఉన్న పెద్ద వ్యాపార సంస్థలో లీటరు రూ.112కే బోర్డులు పెట్టి విక్రయించారు. వంట నూనెల ధరలు పెరగలేదని, గతంలో రేటుకు మాత్రమే విక్రయించాలని ప్రచారం చేయాల్సిన అధికారులు మౌనంగా ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

- కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్



పాడేరు మండలం ఉబ్బేడిపుట్టులో రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. 2021- 22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో పాడేరు మండలం ఉబ్బేడిపుట్టులో నిర్మాణాలు పూర్తి చేసిన రెండు గృహాలను మంగళవారం ఆయన లాంఛనంగా(గృహప్రవేశం) ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17,111 గృహాలు మంజూరు చేయగా, జిల్లా వ్యాప్తంగా 2,871 గృహ నిర్మాణాలు పూర్తి చేసి మంగళవారం గృహ ప్రవేశాలు చేసినట్టు చెప్పారు. జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ యోజనలో మరో 25 వేల గృహాలు నిర్మించడానికి చర్యలు చేపట్టామన్నారు. తొలి విడతగా 8 వేలు, రెండో విడతగా 17 వేల గృహాలు నిర్మిస్తామన్నారు. గతంలో పీఎం ఆవాస్ గ్రామీణ్ కింద మిగిలిపోయిన గృహాలకు సర్వే చేసి మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ బి.బాబు, డీఈఈ రాజబాబు, ఏఈఈ ఈశ్వరరావు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో అధికారులు, విద్యార్థుల మానవహారం

ఉత్సాహంగా స్వచ్ఛతాహీ కార్యక్రమం

స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా పాడేరు పాత బస్టాండ్, అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అధికారులు, విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- వార్త 8వ పేజీలో..

రోగికి తప్పని డోలీ మోత

భారీ వర్షాలకు వంతెనలు కొట్టుకుపోవడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి

- గొల్లపల్లి గ్రామం నుంచి జెర్రిల పీహెచ్‌సీకి రహదారి సౌకర్యం లేక ఇక్కట్లు
- నాలుగు కిలో మీటర్లు కొండలు, గుట్టలు దాటుకుంటూ డోలీలో తీసుకువెళ్లిన వైనం

సీలేరు, సెప్టెంబరు 17: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనలు కొట్టుకుపోవడం, రహదారిపై కొండచరియలు, చెట్లు పడడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తరలించాలంటే డోలీ మోతలు తప్పడం లేదు.

జీకేవీధి మండలం ఎ.ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన చిలకల పెద్దమ్మి (54) మంగళవారం పశువులు కాయడానికి వెళ్లి కొండపై పడిపోవడంతో కాలు విరిగిపోయింది. ఆమెను సమీపంలో ఉన్న ఆర్‌వీ నగర్ ఆస్పత్రికి తీసుకువెళదామంటే ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఈ రహదారిలో కొండచరియలు, భారీ చెట్లు పడడంతో పాటు వాగులపై ఉన్న వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో ఆర్‌వీ నగర్‌కు తీసుకువెళ్లే వీలులేకపోయింది. దీంతో గ్రామస్థులు జెర్రిల పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అయితే అక్కడికి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ కట్టి ఆమెను నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతలవాడ వరకు కొండలు, గుట్టలు దాటుకుంటూ తీసుకువెళ్లారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో జెర్రిల పీహెచ్‌సీకి తరలించారు. గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో రోగులను ఆస్పత్రికి తరలించడం కష్టంగా ఉందని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





డోలీలో మహిళను ఆస్పత్రికి తీసుకువెళుతున్న దృశ్యం

క్రైం... crime news

శారదా నదిలో గల్లంతైన వ్యక్తి మృతి


బద్ది బాబూరావు (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, సెప్టెంబరు 17: మండలంలోని వైలోవ వద్ద శారదా నదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయి గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు. ఇతని మృతదేహం మంగళవారం కొప్పుగొండుపాలెం వద్ద నేవీ వంతెన సమీపంలో లభ్యమైందని సీఐ నరసింగరావు తెలిపారు. వైలోవ గ్రామానికి చెందిన బద్ది బాబూరావు(58) ఈ నెల 15వ తేదీ ఉదయం 7:30 గంటల ప్రాంతంలో శారదా నదికి అవతల వైపున ఉన్న పొలానికి వెళ్లేందుకు నీటిలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ సమయంలో నదిలో నీటి ఉధృతి అధికంగా వుండడంతో ప్రమాదశావత్తూ మునిగిపోయి గల్లంతయ్యాడు. పొలానికని వెళ్లిన వ్యక్తి ఎంతసేపైనా ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నదిలో గాలింపు చర్యలు చేపట్టగా కొప్పుగొండుపాలెం సమీపంలోని నేవీ వంతెన వద్ద బాబూరావు మృతదేహం కనిపించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. తహసీల్దార్ పి.భాగ్యవతి వైలోవ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను వివరాలు అడిగి, పరామర్శించారు.

గంజాయి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

» రూ.2 లక్షలు జరిమానా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: గంజాయి రవాణా కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం పదో అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. 2021 సెప్టెంబరు మూడో తేదీన అనకాపల్లి పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిలో ఒక కార్ల షోరూమ్ పక్కన నిలిపి వుంచిన జీపును తనిఖీ చేయగా 620 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. అప్పటి ఎస్ఐ బి.సతీశ్ గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని, అదే ఏడాది అక్టోబరు 23వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన కిల్లో కృష్ణారావును నిందితుడిగా గుర్తించి అప్పటి సీఐ ఎల్.భాస్కరరావు అరెస్టు చేశారని చెప్పారు. కేసు దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారన్నారు. వీటిని పరిశీలించిన పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య, గంజాయి రవాణా కేసులో కిల్లో కృష్ణారావును ముద్దాయిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ వద్దాది వెంకటరావు కేసును వాదించారు.

ఇసుకతో రెండు ట్రాక్టర్లు, ఒక లారీ సీజ్

నక్కపల్లి, సెప్టెంబరు 17: మండలంలోని డీఎల్‌పురం సమీపంలో మంగళవారం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను, ఉపమాక హైవే జంక్షన్ వద్ద ఒక లారీని పట్టుకుని జరిమానా విధించినట్టు సీఐ కుమారస్వామి చెప్పారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని, సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు కూడా జరగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక గాంధీనగరంలోని జీవీఎంసీ హైస్కూల్‌ను మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని చెప్పారు. అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేయించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. చిన్నపిల్లలు, గర్భిణిలు ఎంతమంది ఉన్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఏర్పాటు


దివ్యాంగుల జేఏసీ నూతన కార్యవర్గం

చోడవరం, సెప్టెంబరు 17 : జిల్లాలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరుతూ పోరాటం చేసేందుకు ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేసినట్టు జిల్లా జిల్లా దివ్యాంగుల సంఘం వ్యవస్థాపకులు దుగ్గిరాల రవికుమార్ ప్రకటించారు. మంగళవారం పట్టణంలో జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులు, నిరుద్యోగులతో సమావేశాన్ని నిర్వహించి జేఏసీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ జేఏసీ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా డీఎస్ ప్రసాద్, గౌరవ సలహాదారుగా పీఎస్టీ పట్నాయక్, అధ్యక్షునిగా వీరుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, కోశాధికారిగా అర్జునరావు, ఉపాధ్యక్షునిగా గడిరెడ్డి రాము, సంయుక్త కార్యదర్శులుగా అప్పలనాయుడు, సురేష్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో హెలెన్ కెల్లర్, లూయిస్ బ్రెయిలీ, స్టీఫెన్‌హాకింగ్‌ల విగ్రహాలు నెలకొల్పాలని తీర్మానించారు.

'మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం'

రాంబిల్లి, సెప్టెంబరు 17: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మత్స్యకార సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మిడి మహేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన మత్స్యకార సంక్షేమ సేవా సమితి మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న వాడనర్సాపురంలో తీరప్రాంత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంఎంఎస్ ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వాసు మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చింతకాయల ఎర్రయ్య, ఎరిపల్లి చిట్టిబాబు, ఎంఎంఎస్ మండల అధ్యక్షుడు సూరాడ వెంకన్న, ప్రధాన కార్యదర్శి బాలపరమేశ్వరరావు, నాయకులు సూరాడ నూకరాజు, చెల్లూరి కొండబాబు, చేపల చిట్టిబాబు, ఎరిపల్లి అప్పలరాజు, సూరాడ దానయ్య పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

» కలెక్టర్ విజయకృష్ణన్

» 'స్వచ్ఛత హి సేవా' పక్షోత్సవాలు ప్రారంభం


తుమ్మపాలలో చీపుర్లు పట్టి రోడ్డుపై ఊడుస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్వచ్ఛత హి 'సేవా' స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛత హి సేవా-2024' పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా తుమ్మపాల పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణపాటు అధికారులు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ప్రతి రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా వుంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని చెప్పారు. డ్రైనేజీ కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి ద్వారా పలురకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన మంచినీటిని తాగాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని, శానిటేషన్ కిట్స్ అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని, దీనివల్ల పచ్చదనం పెరుగుతుందని చెప్పారు.ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు చీపుర్లు చేతపట్టి కొద్దిసేపు రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తమలపాకు రైతుల సమస్యలు

» ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్


తమలపాకు రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 17: తమలపాకుల రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని సత్యవరంలో మంగళవారం తమలపాకుల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు తమలపాకు రైతులందరూ సంఘంగా ఏర్పడాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని తమలపాకు తోటలకు అనుసంధానం చేయాలని, తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. మిగతా పంటల మాదిరి తమలపాకు తోటలకు కూడా బీమా సదుపాయం కల్పించాలని, తమలపాకులను కోసిన తరువాత గ్రేడింగ్ చేసుకునేందుకు షెడ్లు నిర్మించాలని, అవసరం మేరకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జాతీయ సమితి సభ్యుడు రావు గ్గారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొళ్ల మాతినాయుడు, వీసీబీ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహనరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లికి టీమ్ చాంపియన్‌షిప్


పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకోవడమే కాకుండా టీమ్ చాంపియన్‌షిప్ రన్నర్స్‌ను కైవసం చేసుకున్నారు. వివిధ కేటగిరీల్లో నాగరాజు, పి.దినేశ్, లవకుమార్, బాలసాయి చరణ్, ధరనేశ్, కేవీవీఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, అందే గణేశ్, రాణా, శ్రీను, సంతోష్ బంగారు పతకాలు; ప్రితేష్, బీవీ రామకృష్ణ, ప్రవల్లిక, పవన్‌కుమార్, లోకేశ్, రజత పతకాలు, ఇ.గణేశ్‌నాయుడు, ప్రవీణ్, తులసీరావు కాంస్య పతకాలు సాధించారు. వీరిని అనకాపల్లి జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు అప్పలనాయుడు, అధ్యక్షురాలు లీలా, ప్రధాన కార్యదర్శి బద్రినాథ్ అభినందించారు.

పీఎంఏవై లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగింత


లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు, తదితరులు

అనకాపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0' మార్గదర్శకాలను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా అనకాపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు.

ఏపీపీటీఏ జిల్లా నూతన కార్యవర్గం


ఏపీపీటీఏ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఏపీపీటీఏ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం స్థానిక ఉడ్‌పేట ప్రైమరీ స్కూల్‌లో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బోయిన చిన్నారావు, ప్రధాన కార్యదర్శిగా జి.షణ్ముఖరావు, ఆర్థిక కార్యదర్శిగా చెల్లా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సరోజిని, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరం ప్రారంభం


సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం సబ్బవరం, కె.కోటపాడు మండలాలకు చెందిన దివ్యాంగులకు సదరం క్యాంప్ నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ ధ్రువీకరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ శిబిరానికి 74 మంది దివ్యాంగులు హాజరయ్యారని, వీరిలో 44 మందిని అర్హులుగా గుర్తించామని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 40 మంది ఆర్థోపెడిక్ సమస్యకు సంబంధించిన వారు, ముగ్గురు రక్త సంబంధ సమస్య, ఒకరు కిడ్నీ బాధితుడు ఉన్నారన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 17: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లభర్తీకి నాలుగో విడత ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఐటీఐ కేంద్రం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26లోగా ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. 27న సాయంత్రం 3 గంటలు వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 పాస్‌పోర్టు ఫొటోలతో 28న ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఐడీ మార్చ కూడదని పేర్కొన్నారు, అభ్యర్థుల ఆధార్ వివరాలు, ఎస్సెస్సీ సర్టిఫికెట్ వివరాలు సరిపోవాలని సూచించారు. ఈ వివరాలకు ఫోన్ : 87907 41378, 89772 72231, 7013737243లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో ఏపీ టాప్‌లో నిలవాలి

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

మాడుగుల, సెప్టెంబరు 17: బీజేపీ సభ్యత్వ నమోదులో ఆంధ్రప్రదేశ్ ఒకటో స్థానంలో నిలవాలని, ఇందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తన వంతు కృషి చేయాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మాడుగులలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రమేశ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. తదుపరి మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొన్నారు. పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవిష్యత్తులో ప్రతి గ్రామానా బీజేపీ పటిష్ఠం కావాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన నియోజకవర్గంలోని పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, బీజేపీ నాయకులు మేరపురెడ్డి శ్రీనివాసరావు, గంగయ్య, సంతోషసుబ్బలక్ష్మిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ, టీడీపీ టౌన్‌పార్టీ అధ్యక్షులు రంజిత్‌వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు

మాడుగుల ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్‌క్లబ్ భవన పునఃనిర్మాణానికి రూ.5 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయనున్నట్టు ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. మాడుగుల వచ్చిన ఆయనను మాడుగుల యూనియన్ ప్రతినిధులు కలిసి భవనం విషయమై వినతిపత్రం అందజేయగా, దీంతో రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

భారీ వృక్షాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు

» అధికారులకు ఎమ్మెల్యే సుందరపు ఆదేశాలు


నరికివేసిన భారీ వృక్షాన్ని పరిశీలించిన అనంతరం పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 17: పట్టణానికి సమీపంలోని వాటర్ సంపు వద్ద ప్రధాన రహదారి పక్కన ఆదివారం రాత్రియంత్రాలతో భారీ వృక్షాన్ని కూల్చివేసిన సంఘటనచర్చనీయాంశంగా మారింది. ఎస్.రాయవరం మండలానికి చెందిన రియల్ వ్యాపారి తన స్థలానికి అడ్డుగా ఉందన్న నెపంతో భారీ వృక్షాన్ని తొలగించినట్టు స్థానికులు చెబుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వార్త రావడంతో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ స్పందించారు. నరికివేతకు గురైన చెట్టును సీఐ ధనుంజయరావు, ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్‌లతో కలిసి పరిశీలించారు. భారీ వృక్షం నరికివేయించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏలేరు కాలువ గండి పూడ్చివేత

» యథావిధిగా విశాఖపట్నంకు నీటి సరఫరా


ఏలేరు కాలువ గండి పూడ్చిన దృశ్యం

మాకవరపాలెం, సెప్టెంబరు 17: ఏలేరు కాలువ గండి పూడ్చివేత్త పనులు ఎట్టకేలకు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం మాకవరపాలెం మండలం రాచపల్లి 99.6 కూడలి వద్ద ఏలేరు కాలువకు గండి పడిన విషయం తెలిసిందే. దీంతో జీఎంసీ అధికారులు పనులు ప్రారంభించినప్పటికీ ఎగువ ప్రాంతం నుంచి అధికంగా నీరు రావడంతో పాటు గండిపడిన చోట బాగా లోతట్టు ప్రాంతం కావడంతో నీటి ఉధృతికి సోమవారం వేసిన గండి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో తిరిగి మళ్లీ పనులు మొదలు పెట్టి మంగళవారం ఉదయం నాటికి పూర్తి చేశారు. దీంతో విశాఖట్నానికి ఏలేరు కాలువ నీరు యథావిధిగా సరఫరా సాధ్యమైంది.

అయితే విశాఖపట్నంలోని కంపెనీలతో పాటు తాగునీటి అవసరాలకు 200 క్యూసెక్కుల నీరు అవసరమని, కానీ సుమారు 80 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కాలువకు గండి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు జీఎంసీ అధికారులు పేర్కొన్నారు.

ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మె బాట

» డీఆర్వో, డీసీహెచ్ఎస్‌లకు నోటీసులు


డీఆర్‌వో దయానిధికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తూరు, సెప్టెంబరు 17: వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లాలో ఉన్న ఎనిమిది ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్‌వైజింగ్ కార్మికులు మంగళవారం జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ, తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో సమ్మె చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కోస్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను ఈ నెల 29లోగా పరిష్కారించకపోతే 30వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్వో దయానిధి, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి వసంతరావులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, వరప్రసాద్, సంతోష్, పెదపూడి సత్యవతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సాయం


హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 17: స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్‌పై హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన పైలా అప్పలనాయుడు కుటుంబానికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ దీపిక ఆర్థిక సాయం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్సు మొత్తం రూ.4,15,515 చెక్కును హోంగార్డు భార్య కుమారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎం.దేవప్రసాద్, కార్యాలయ ఏవో బి.శారద, తదితరులు పాల్గొన్నారు.

జనవాణికి వినతుల వెల్లువ

నక్కపల్లి, సెప్టెంబరు 17: జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ చెప్పారు. నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పలు ప్రాంతాల ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మండలంలో నెల రోజులపాటు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. కొన్ని సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిక్కిస్వామి, పాము గణేశ్, చంద్రరావు, రంగనాథ్, జగన్,సతీశ్, మహేశ్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నులి పురుగుల నివారణ మందులు మింగిస్తున్న కలెక్టర్

నులి పురుగులతో ఎదుగుదలకు ముప్పు: కలెక్టర్

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: నులి పురుగులతో పిల్లల ఎదుగుదలకు ముప్పు వాటిల్లుతుందని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చెప్పారు. పాడేరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో నులి పురుగుల నివారణ మందులు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతీ ఆరు నెలలకు ఆల్బెండ్‌జోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను వేసుకోవాలన్నారు. నులి పురుగులు ఉంటే శారీరక, మానసిక ఎదుగుదల లోపానికి గురవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 3.2 లక్షల మంది విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలను అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీఐవో సాధన, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ వై.కిశోర్‌కుమార్, వైద్య సిబ్బంది గుల్లెల సింహాద్రి, పాత్రో, పి.దుర్గ, ఎలీషా రావు, విజయ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ దృష్టికి మన్యం సమస్యలు



మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను పాడేరు, అరకు నియోజక వర్గాల ఇన్‌చార్జులు గిడ్డి ఈశ్వరి, ఎస్.దొన్నుదొర అమరావతి సచివాలయ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మన్యం సమస్యలను వివరించారు. తుఫాన్ ప్రభావంతో గిరిజన ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి గిరిజనులు మృతి చెందడం, తీవ్ర గాయాలకు గురికావడం, అనేక మంది గృహాలు కూలిపోవడం, పంట పొలాలు ముంపునకు గురికావడం వంటి ఘటనలను లోకేశ్‌కు వివరించామని ఈశ్వరి, దొన్నుదొర తెలిపారు. వీలైనంత త్వరగా బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా రెండు నియోజకవర్గాలలో నెలకొన్న వివిధ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు వారు తెలిపారు.

ఘనంగా భగవాన్ విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ పూజ ప్రాముఖ్యతను వివరించారు. విశ్వకర్మ జయంతి, విశ్వకర్మ పూజను తయారీదారులు, ఇంజనీర్లు, ఘనంగా నిర్వహిస్తారన్నారు. అలాగే కార్మికులు పరిశ్రమల్లో పనిముట్లకు విశ్వకర్మ జయంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్‌వో పద్మావతి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు లక్కోజు నాగభూషణం, చుక్కా సత్యనారాయణ, వేమవరపు సత్తిబాబు, తగరంపూడి తాతారావు, సూరిబాబు, కంబిడి లతాకుమారి, బి.కెజియారాణి, పాల్గొన్నారు.

పాడేరు రూరల్: పాడేరులో భగవాన్ ఆది విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నుంచి సంఘ సభ్యులు, భక్తులు పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. పట్టణ ప్రజలు బ్రహ్మేంద్రస్వామిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే మఠం వద్ద స్వామి విగ్రహానికి పూజలను చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు కొట్టగుళ్లి సంహాచలంనాయుడు, ఉప్పల వెంకటరత్నం, కిముడు ప్రభాకర్, దాసరి నాగు, నారాయణ, సంఘం అధ్యక్షుడు కొమ్మోజి వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు నవర గోవిందరావు, సంఘ సభ్యులు బుజ్జి, నానాజీ, కెజియారాణి, మధు, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

డీడీ కార్యాలయ సిబ్బందిపై చర్యలు చేపట్టాలి

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: జిల్లా కేంద్రం పాడేరు ఐటీడీఏ కార్యాలయంలోని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (విద్య) కార్యాలయంలో నిర్లక్ష్యంగా పనిచేస్తున్న సిబ్బందిపై కలెక్టర్ చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ శేషాద్రి రావు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నా కార్యాలయ సిబ్బంది మాత్రం పరిష్కారంలో జాప్యం చేస్తున్నారన్నారు. అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల పదవీ విరమణ చేసిన వారికి బకాయిల ఉత్తర్వులు, పదవీ విరమణ చేయబోయే హెచ్‌ఎంల ప్రతిపాదనలు, సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం పునర్నియామక ఉత్తర్వులలో జాప్యం సరికాదన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల క్వార్టర్స్ దీర్ఘకాలంగా ఖాళీ చేయకుండా కాలయాపన చేయడం, ఐటీడీఏ పీవో ఉత్తర్వులను సైతం పెడచెవిని పెట్టడం వంటి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

» జిల్లా రవాణా శాఖాధికారి లీలాప్రసాద్



డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీటీవో లీలాప్రసాద్

హుకుంపేట, సెప్టెంబరు 17: డ్రైవర్లు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖాధికారి లీలాప్రసాద్ హెచ్చరించారు. పాడేరు ఆర్టీసీ డిపోలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్లకు హుకుంపేట ఆర్టీఏ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొంత మంది డ్రైవర్లకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్స్, బ్యాడ్జీలు కలిగి ఉండాలని, క్రమశిక్షణతో వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీనియర్ డ్రైవర్లు పలు సూచనలు చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

» జిల్లా కేంద్రంలో ఘనంగా 'స్వచ్ఛత హీ కార్యక్రమం'



స్వచ్ఛత హీ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు

పాడేరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్, అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించిన స్వచ్ఛత హీ ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక ప్రభుత్వ శాఖ పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. కళాశాల, పాఠశాలలో పరిశుభ్రతకు సమయం కేటాయించాలని, శ్రమదానంతో పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు. మండల ప్రత్యేకాధికారులు మండలాల్లో పర్యటించినపుడు వారానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి స్వచ్ఛత హీ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్ షా, డీఈవో పి.బ్రహ్మాజీ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, ఎల్‌డీఎం ఏఎం.నాయుడు, డీఎల్‌పీవో డివిజనల్ పీఎస్.కుమార్, ఎంపీడీవో సాయినవీన్, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఎంఈవోలు విశ్వప్రసాద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిప్‌లైన్ వివాదంపై గ్రామసభ

» స్థానిక సొసైటీకి అవకాశం ఇవ్వాలని గిరిజనుల డిమాండ్

» వివరాలు సేకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



బొర్రాలో గ్రామ సభ నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ

అనంతగిరి, సెప్టెంబరు 17: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను ఆనుకుని ప్రైవేటు వ్యక్తి నిర్వహిస్తున్న జిప్‌లైన్‌కు సంబంధించిన వివాదంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో బొర్రా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. స్థానిక గిరిజనులు, విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక ఫిర్యాదు మేరకు ఈ సభ నిర్వహించి గిరిజనులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నిర్వహించే వాటికి తప్పనిసరిగా గ్రామసభ తీర్మానం ఉండాలన్నారు. గ్రామసభ నిర్వహించకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘించి పర్యాటకశాఖ ప్రైవేటు వ్యక్తికి జిప్‌లైన్‌ను కట్టబెట్టిందని, ఇది చట్టవిరుద్ధమని విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు వివరించారు. ట్రయల్ రన్‌కు మాత్రమే అనుమతి తీసుకుని గ్రామసభ తీర్మానం లేకుండా తొమ్మిది నెలల పాటు నిర్వాహకుడు జిప్‌లైన్ నడిపారని సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు అరుణ మండిపడ్డారు. స్థానిక గిరిజన సొసైటీ ద్వారా జిప్‌లైన్ నడిపే విధంగా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరారు. స్థానికులు, ప్రజాప్రతినిధులు, జిప్‌లైన్ నిర్వాహకుడి నుంచి సేకరించిన అభిప్రాయాలను నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, ఎంపీడీవో నగేశ్, పీసా అధ్యక్షుడు దానియేలు, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిప్‌లైన్ నిర్వాహకుడు జస్టిన్ పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

» ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కేజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: చట్రాపల్లి వరద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వైద్యులకు సూచించారు. తుఫాన్ సమయంలో కొండచరియలు గ్రామంపైకి విరిగిపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షతగాత్రులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన చట్రాపల్లి గ్రామస్థులను ఆదుకుంటామన్నారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం విచారకమని వాపోయారు. అనంతరం అనారోగ్యంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజును ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కూడా సురేష్‌కుమార్, కూడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చింతపల్లి: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుమిత్ర, పండన్నలను జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పరామర్శించారు. బాధితులకు అవసరమైన మందులు, ఇతర ఖర్చులు ప్రభుత్వం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పసుపులేటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ముందుకురండి: ఎంపీపీ



చెత్తను సేకరిస్తున్న ఎంపీపీ అనుషదేవి, అధికారులు, కూటమి నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 17: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రజలు ముందుకురావాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి కోరారు. మండల కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కూటమి నాయకులతో కలిసి తొలుత ర్యాలీ చేశారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులానున్న చెత్తను తొలగించారు. సంపద కేంద్రంలో మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రాలకు ఆరోగ్య తనిఖీలు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, ఎంఈవో పనసల ప్రసాద్, ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణమూర్తి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం జేఏ కొండలరావు, కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు, టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, సర్పంచ్ దురియా పుష్పలత, నాయకులు ఆర్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పారిశుధ్యం మెరుగుపర్చుకోవాలని స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మంగళవారం జీకే వీధి, వంచుల గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు మానహారం, ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోఆర్‌డీ పాపారావు, సర్పంచ్ సుభద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేశ్ పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో గిరిజన యువకుడికి తీవ్ర గాయాలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 17: మండలంలో కితలంగి పంచాయతీ పరిధిలోని పింపోల్‌గుడ గ్రామంలో ఓ గిరిజన యువకుడు కందిరీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. పింపోల్‌గుడ గ్రామానికి కోర్రా ప్రవీణ్‌కుమార్ సమీపంలోని కాఫీ తోటలో పనికి వెళ్లాడు. తోటలో పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా కందిరీగలు ఆయనపై దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయిన ప్రవీణ్‌కుమార్‌ను కుటుంబీకులు గమనించి హుటాహుటిన డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎప్పటికి దారికొచ్చేనో?

... 5వ పేజీ తరువాయి

సమయం కూడా వృథా అవుతోంది. భారీ వర్షాలకు రహదారి దెబ్బతినక ముందు సీలేరు నుంచి జీకేవీధి, నర్సీపట్నం మీదుగా విశాఖపట్నానికి రూ.350ల ఖర్చుతో వెళ్లిపోయేవారు. కొంతమంది ప్రైవేటు వాహనదారులు సీలేరు నుంచి నర్సీపట్నానికి రావడానికి రూ.10,000ల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇది సామాన్యులకు భారంగా మారింది. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి బలహీనపడిన రెండు వంతెనల వద్ద ఇప్పట్లో కాంక్రీట్ పనులు సాధ్యపడకపోతే కనీసం వంతెనల వద్ద డైవర్షన్ మార్గం అయినా ఏర్పాటు చేసి సీలేరు- జీకేవీధి మధ్య బస్సుల రాకపోకలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వంతెనకు సపోర్టులు పెట్టి పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ జేఈ





సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు... (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అక్రమ నిర్మాణాలపై దృష్టిసారించండి

» మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశం

అరకులోయ, సెప్టెంబరు 17: మండలంలోని పలు పంచాయతీల్లో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. అరకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో పెదలబుడు, పద్మాపురం, అరకులోయ పట్టణం, పద్మాపురం, యండపల్లివలస పంచాయతీల పరిధిలో స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అరకులోయ పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ప్రజలు రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనధికార నిర్మాణాలను తొలగించాలని కోరారు. అదే విధంగా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపాలని, గిరిజనులకు మౌళికసౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ దాసుబాబు మాట్లాడుతూ పారిశుధ్య పనులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సరిపోవడంలేదని దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే జెడ్పీటీసీ సభ్యుల నిధులనుంచి కొంతమేర కేటాయించాలని కోరారు. సుంకరమెట్ట సర్పంచ్ చి నబాబు, ఇరగాయి ఎంపీటీసీ సభ్యురాలు బుట్కీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కరించాలని కోరారు. అరకులోయ పట్టణంలో రెండు శ్మశాన వాటికలకు ప్రహరీలు నిర్మించాలని పెదలబుడు ఎంపీటీసీ దురియా ఆనంద్, ఎల్‌బీ భీమరాజు కోరారు. ఈ సందర్భంగా పలుశాఖల అభివృద్ధి పనులను వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వరద బాధితులకు విరాళాల సేకరణ

చింతపల్లి, సెప్టెంబరు 17: చట్రాపల్లి వరద బాధితులను ఆదుకునేందుకు అందరూ సహకరించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కోరారు. మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులతో కలిసి వరద బాధితుల కోసం మంగళవారం విరాళాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులతో చట్రాపల్లి గిరిజనులు నష్టపోయారని, ప్రస్తుతం పునరావాస కేంద్రాల్లో ఉంటూ సాయం కోసం ఎదురు చూస్తున్నారని, వారికి భరోసా ఇచ్చేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, వివిధ సంఘాల నాయకులు దూనబోయిన రమణ, రీమల మౌళి, బీఏ రాజు, బాజ్జీ, తాడి రమణ, తాటిపాకల నాగేశ్వరరావు, వీరేంద్ర, గాజులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అరకులోయ మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. కమిటీ ప్రతినిధులు రత్నరాజు, భూపతిలెనిన్‌రాజు, చంద్రశేఖర్‌ప్రసాద్, పైడిరాజు తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు. వరదలతో లక్షలాది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవడానికి అందరూ సహృదయంతో ముందుకురావాలని వారు కోరారు. నాయకులు లక్ష్మణ్‌మాల, రవికుమార్, మోజెస్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: మండలంలోని కొత్తపాడేరులో మంగళవారం బీజేపీ నాయకులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద లబ్ధిదారులందరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో పేదల సంక్షేమానికి పార్టీ శ్రేణులు పాటుపడాలన్నారు. తుఫాన్ ప్రభావంతో పంటలు, ఆస్తులు నష్టపోయిన వారిని గుర్తించి పార్టీలకతీతంగా నష్టపరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు కురసా రాజారావు, మినుముల గోపాలపాత్రుడు, సల్లా రామకృష్ణ, మహేష్, నందోలి శివకుమార్, పాంగి రవిచంద్ర, వంతాల గాసన్న, కల్యాణ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి సూచించారు. కళాశాలలో మంగళవారం చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణ, బయట ప్రాంతాల్లో చెత్త వేయకూడదని చెప్పారు. స్వచ్ఛమైన, చెత్తరహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాల నుంచి సినిమాహాలు సెంటర్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్, ఎన్ఎస్ఎస్ పీవో జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు బి.రమేష్‌బాబు, డి.గణేష్, జి.దామోదర్, జి.కోటేశ్వరరావు, మురళీధరరావు, కె.అప్పలనాయుడు, కొత్తంనాయుడు పాల్గొన్నారు.

లోచలిపుట్టులో అన్న సమారాధన

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: లోచలిపుట్టులో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు పది వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

చింతపల్లి, సెప్టెంబరు 17: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి సూచించారు. చింతపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గోకులాల నిర్మాణాలకు అర్హులతో దరఖాస్తు చేయించాలన్నారు. వర్షాలతో నష్ట పోయిన బాధితుల వివరాలు అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలని పూర్ణచంద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంద్రాబు లక్ష్మణ్, రీమల ఆనందరావు, దూరి రామకృష్ణ పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించరూ..

పాడేరు రూరల్, సెప్టెంబరు 17: గుత్తులపుట్టు పంచాయతీ కేంద్రంలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ సురేష్‌కుమార్ కోరారు. గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ (33 కేవీ) ఉన్నప్పటికీ, ట్రాన్స్‌ఫార్మర్ పాతది కావడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పూర్తి స్థాయిలో విద్యుత్ లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రతి తల్లీ ఒక మొక్క నాటాలి

చింతపల్లి, సెప్టెంబరు 17: గ్రామాల్లో ప్రతి తల్లీ ఒక మొక్క నాటాలని ఎన్ఆర్ఈజీఎస్ పీఎస్‌వో రాంప్రసాద్ కోరారు. వంచుల పంచాయతీ ఈతలబంద గ్రామంలో మంగళవారం మదర్ ఫర్ ప్లాంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తల్లులతో మొక్కలు నాటించారు. అనంతరం అయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ తల్లితో 700 మొక్కలు నాటిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ కాసులమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, ఎఫ్ఏ కాంతారావు పాల్గొన్నారు.

'గిరిజనులకు అండగా ప్రభుత్వం'

చింతపల్లి, సెప్టెంబరు 17: చట్రాపల్లి వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించి బాధితులకు నిత్యావసర సరకులు, దుస్తులు, నగదు అందజేశారు. వరదల వల్ల మృతి చెందిన కుమారికి ప్రభుత్వం పరిహారం ప్రకటించిందన్నారు. సప్పర్ల పునరావాస కేంద్రంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. చట్రాపల్లి గిరిజనులను ప్రభుత్వం ఆదుకున్నంటున్న తీరు అభినందనీయమన్నారు. నాయకులు ఎం.మహేశ్, మామిడి బాలయ్య, బేరా సత్యనారాయణ పడాల్, ఉండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.